క్లుప్తంగా

ఊపందుకున్న నారుమడులు



ఐ.పోలవరంలో దమ్ము చేస్తున్న రైతు

ఐ.పోలవరం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గడచిన రెండు రోజులుగా మండలంలో ఒక మోస్తరు నుంచి భారీ వర్షం కురుస్తోంది. వర్షానికి లోతట్టు ప్రాంతాలు, కాలనీల్లో నీరు నిలిచిపోయింది. వర్షాలు జోరందుకోవడం మండల పరిధిలో మురమళ్ల, కొమరగిరి, జి.మూలపొలెం, కేశనకుర్రు వంటి ప్రాంతాల్లో నారుమడులు వేసే పనులు మొదలయ్యాయి. ఈ ప్రాంతాల్లో ఇప్పటికే నాట్లు పడాల్సి ఉంది. అయితే పంట కాలువలకు నీరు విడుదల ఆలస్యం కావడం, సకాలంలో వర్షాలు పడకపోవడంతో ఇక్కడ నారుమడులు ఆలస్యమయ్యాయి.

డీఈఓకు వినతిపత్రం



డీఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న కోకోఫెడ్ సభ్యులు

ముమ్మిడివరం: విద్యాహక్కు చట్టంపై సరైన అవగాహన కోసం ఒక సమావేశం ఏర్పాటు చేయాలని డీఈఓ కార్యాలయంలో కోకో ఫెడ్ తరఫున వినతిపత్రం అందజేశారు. ప్రైవేటు విద్యా సంస్థలపై కొన్ని ఆరోపణలు పెరెంట్స్ తరఫున వచ్చిన నేపథ్యంలో ఒక అవగాహన సదస్సు ఏర్పాటు చేయాలని కోకోఫెడ్ చైర్మన్ అరిగెల బలరామమూర్తి, కార్యదర్శి ఆదిత్యకిరణ్, కన్వీనర్లు అద్దంకి అమరేశ్వరరావు, మంద రాజేష అడపా వెంకట్ ముమ్మిడివరం డీఈఓ కార్యాలయం గురువారం వినతిపత్రం అందజేశారు.

ఘనంగా రుద్ర హోమం



ఆలయంలో రుద్రహోమం చేస్తున్న పండితులు

ఐ.పోలవరం: జ్యేష్ఠ మాసం ఆరుద్ర నక్షత్రం మహా పర్వదినాన్ని పురస్కరించుకుని మురమళ్ల వీరేశ్వరస్వామి వారి ఆలయంలో గురువారం రుద్రహోమం ఘనంగా నిర్వహించారు. అర్చకులు బ్రహ్మశ్రీ పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తొలుత గణపతి పూజ, మండపారాదన అనంతరం రుద్ర హోమం పూర్ణాహుతి నిర్వహించారు. ప్రతి నెలా ఆరుద్ర నక్షత్రం రోజున రుద్ర హోమం కార్యక్రమాలు భక్తుల గోత్రనామాలతో దేవస్థానం తరఫున నిర్వహిస్తారు. 38 మంది భక్తులు రుద్ర హోమంలో పాల్గొన్నారు. ఏర్పాట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి వి.సత్యనారాయణ పర్యవేక్షించారు.

జిల్లా పాస్టర్స్ కమిటీ నూతన కార్యవర్గం ఎన్నిక

అమలాపురం టౌన్: జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ కమిటీకి స్థానిక మన్నా జూబ్లీ చర్చిలో ఎన్నికలు ఏకగ్రీవంగా గురువారం జరిగాయి. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి జిల్లాలోని అన్ని మండలాల ఫెలోషిప్ కమిటీల ప్రతినిధులు పాల్గొని జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. జిల్లా యునైటెడ్ పాస్టర్స్ ఫెల్ షిప్ కమిటీకి అధ్యక్షునిగాఅమలాపురానికి చెందిన సీనియర్ సంఘ కాపరి రెవ.కార్ల్ డేవిడ్ కొమానపల్లి (లాల్) మరోసారి ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా రెవ.విక్టర్ నందా, రెవ.యు.వి.భాస్కరరావు, రెవ.ఎర్నెస్ట్ తాతపూడి, ప్రధాన కార్యదర్శిగా ముంగి యోహోషువ, సంయుక్త కార్యదర్శిగా రెవ.అబ్రహం ఫిన్ని, కోశాధికారిగా రెవ.ఇమ్మానియేలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లా ఫెల్ షిప్ అధ్యక్షునిగా ఎన్నికైన లాల్‌ను ఘనంగా సత్కరించి అభినందించారు.

రామకృష్ణారావుకు శ్రీకాంత్ పరామర్శ



పార్టీ నాయకులను పరామర్శిస్తున్న కో ఆర్డినేటర్ శ్రీకాంత్

ఉప్పలగుప్తం: గొల్లవిల్లి పంచాయతీ పరిధి వాడపర్రు ప్రాంతానికి చెందిన పార్టీ నాయకుడు మురముళ్ల రామకృష్ణారావు సతీమణి సత్యవతి ఇటీవల గుండెపోటుతో మృతి చెందింది. ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులను అమలాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ పినిపే శ్రీకాంత్ గురువారం పరామర్శించారు. సత్యవతి చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు బడుగు గణేష్, పార్టీ నాయకులు చప్పిడి దుర్గారావు, మారిశెట్టి నరేష్, వీరవెల్లి చినబాబు, నందుల ఏసుబాబు, చప్పిడి వెంకటేశ్వరరావు, కడలి సాయిబాబు, రాయుడు వెంకటేష్, ఉప్పలగుప్తపు ఈశ్వరరావు, అడపా దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు మా అడ్డా!



అమలాపురం పట్టణంలో రోడ్డుపై తిరుగుతున్న పశువులు



పట్టణం నల్ల వంతెనపై వాహనాలు వెళుతున్నా ఖాతరు చేయకుండా పడుకున్న ఆవు

- రహదారిపై తిష్ట వేసిన పశువులు
- వాటితో ట్రాఫిక్‌కు అంతరాయం
- ప్రమాదాలబారిన వాహనదారులు
- పట్టించుకోని యజమానులు

అమలాపురం టౌన్: రోడ్లపై పశువులు తిష్ట వేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుకు అడ్డంగా ఉండడంతో రాత్రిళ్లు వాహనదారులు వాటిని తప్పించబోయి గాయాలపాలవుతున్నారు. అంతేకాకుండా వీటి వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోంది. అమలాపురం పట్టణంలో దాదాపు 300 పశువులు నిత్యం పగలు రోడ్లపైనే సంచరిస్తున్నాయి. రోడ్డు మా అడ్డా అన్నట్లుగా ముఖ్యంగా ఆవులు రోడ్లపైనే సంచరిస్తూ లేదా పడుకుని వాహనాలు వస్తున్నా వాటిని ఏ మాత్రం ఖాతరు చేయకుండా ఉంటాయి. రోడ్ల పైనే మా నివాసం అన్నట్టుగా నిద్రపోతాయి. అవి వాహనాల రద్దీలో సైతం హారన్లను కూడా పట్టించుకోవు. రోడ్డుపై పశువు నిలబడి ఉన్నా పడుకుని ఉన్నా వాహన చోదకులు వాటిని జాగ్రత్తగా తప్పించుకుని వెళ్లాలే తప్ప అవి మాత్రం అక్కడే ఉంటాయి.

పట్టనట్టు ఉంటున్న యజమానులు

పశువుల యజమానులు వాటిని రోడ్లపై వదిలేసి వారు మాత్రం పట్టణం సమీప గ్రామాల్లో ఉంటారు. ఆవులకు ఎంతలా ట్రెనింగ్ ఇస్తారంటే ఉదయం పెంపకందారుని ఇంటి వద్ద పాలు ఇచ్చేస్తాయి. అనంతరం అవి రోడ్లపైకి వచ్చి నానా చెత్త మేస్తాయి. మళ్లీ సాయంత్రాలనికి ఆ పెంపకందారుని ఇంటికి వెళ్లి పాలు ఇచ్చేస్తాయి. మళ్లీ రోడ్లపైకి వచ్చేస్తాయి. ఇదీ ఆ ఆవుల దినచర్య. ఆంబోతులు, మిగిలిన పశువులు రోడ్లపై పగలనక, రేయనక రోడ్లపైనే సంచరిస్తాయి. రాత్రి సమయాల్లో రోడ్లపైనే పడుకుని విశ్రాంతి తీసుకుంటాయి. పట్టణంలోని గడియారం స్తంభం సెంటరు, ముమ్మిడివరం గేటు సెంటరు, నల్లవంతెన, ఎర్ర వంతెన రోడ్డు, హైస్కూలు రోడ్డు ఇలా ప్రతి మెయిన్ రోడ్లన్నీ పశువులతో నిండి ఉంటాయి. మున్సిపాలిటీ గతంలో పలు మార్లు పలు మార్లు చర్యలు తీసుకున్నా కొద్ది రోజులకు పరిస్థితి షరా మామూలే. మున్సిపాలిటీ ఓ స్పెషల్ డ్రైవ్‌లా పశువుల కట్టడికి చర్యలు తీసుకుంటూనే వాటి యాజమానులను కూడా గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినప్పుడు ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పట్టణ ప్రజలు సూచిస్తున్నారు.

రోడ్లపై పశువులు సంచరిస్తే చర్యలే

అమలాపురం టౌన్: పలు రోడ్డు ప్రమాదాలకు, ట్రాఫిక్ సమస్యకు కారణంగా మారిన పశువులను పూర్తిగా కట్టడి చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్టు మున్సిపల్ కమిషనర్ వి.నిర్మల్‌కుమార్ స్పష్టం చేశారు. పట్టణంలోని రోడ్లపై ముఖ్యంగా ఆవుల యజమానులు వాటిని వదిలేస్తున్నారని, ఆవులు, ఆబోతులు తదితర పశువులను తక్షణమే వాటిని బంధించి మీ పశుశాలల్లో కట్టుకోవాలని, లేకుంటే చర్యలు తీసుకుంటామని కమిషనర్ సూచించారు. తమ విజ్ఞప్తులను పట్టించుకోకుండా రోడ్లపై అలాగే పశువులు వదిలేస్తే మున్సిపాలిటీ ప్రత్యేక బృందాల ద్వారా ఆ పశువులను పట్టుకుని గోశాలలకు తరలించే ఏర్పాట్లు చేస్తామని చెప్పారు. అలాగే సంబంధిత పశువుల యాజమానులను గుర్తించి వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు. తీసుకోబోయే చర్యలను కౌన్సిల్ సమావేశంలో చర్చించే ఏర్పాట్లు చేస్తామన్నారు. కౌన్సిల్ తీర్మానం, ఆమోదం పొందిన తర్వాత అధికారికంగా పశువులు యాజమానులపై చర్యలు తీసుకోవడంతో పాటు వాటిని అదుపు చేసే పనులను మొదలు పెడతామని కమిషనర్ నిర్మల్ కుమార్ తెలిపారు.

రక్షిత మంచినీటి చెరువుకు మరమ్మతులు



చినబొడ్డు వెంకటాయపాలెం చెరువు వద్ద విలేకరులతో మాట్లాడుతున్న నాయకులు

తాళ్లరేవు: కోరంగ పంచాయతీ చినబొడ్డు వెంకటాయపాలెం రక్షిత మంచినీటి చెరువు మరమ్మతు పనులు చేపట్టినట్టు గ్రామ పంచాయతీ కార్యదర్శి వీజేవీ రమణ తెలిపారు. గురువారం స్థానిక చెరువు వద్ద స్థానిక నాయకులతో కలిసి ఆయన పనులను పరిశీలించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ సుమారు 8 గ్రామాలకు తాగునీటిని సరఫరా చేసే ఈ చెరువు అడుగంటడంతో చేపలు చనిపోయి నీరు కలుషితమయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో చెరువులో నీటిని బయటకు తోడి మరమ్మతులు చేసి, బ్లీచింగ్‌తో శుభ్రం చేయనున్నట్టు తెలిపారు. ప్రస్తుతం రా వాటర్‌ను ఫిల్టర్‌ల ద్వారా శుభ్రం చేసి కుళాయిల ద్వారా సరఫరా చేస్తున్నామని, ఎటువంటి తాగునీటి సమస్య లేదని రమణ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు టి.లక్ష్మణరావు, పి.రామలక్ష్మి, పెయ్యల శ్రీనివాస్, కొపనాతి నాగరాజు, వాడ్రేవు వీరబాబు, వైదాడి శ్రీనివాస్, బర్రే బుజ్జి, కొప్పిశెట్టి చంటి తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ ఆపరేటర్‌కు రూ.50 వేల ఆర్థిక సాయం



శ్రీనివాసరావుకు రూ.50 వేలు అందిస్తున్న సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: పదేళ్ల కిందట ఓ ప్రమాదంలో రెండు కాళ్లు, వెన్ను ముక దెబ్బతిన్న అమలాపురానికి చెందిన క్రేన్ ఆపరేటర్ మామిడిశెట్టి శ్రీనివాసరావు (43)కు క్రేన్ ఓనర్స్ అండ్ ఆపరేటర్స్ సంఘం (సీఐటీయూ అనుబంధం) ప్రతినిధులు రూ.50 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. తోటి కార్మికుడు మంచాన పడి లేవలేని స్థితిలో అవస్థలు పడుతున్న బాధితుడు శ్రీనివాసరావును ఆదుకునేందుకు క్రేన్ ఆపరేటర్లు ముందుకు వచ్చి ఈ సాయం చేశారు. పట్టణంలోని అబ్బిరెడ్డికాలనీలో నివాసముంటున్న శ్రీనివాసరావు ఇంటికి ఆ సంఘం ప్రతినిధులు గురువారం వచ్చి ఆర్థిక సాయాన్ని అందించారు. తోటి కార్మికుడు మంచంపై అచేతనంగా పడి ఉండడాన్ని చూసి చలించారు. సంఘం ప్రతినిధులు బొంతు గణేష్‌కుమార్, మల్లాడి సుదర్శన్, బొక్కా తిరుపతి, పినిపాల శరత్, వెంకన్న తదితరులు బాధితుడు శ్రీనివాసరావు సాయం అందించారు. శ్రీనివాసరావు కుటుంబ పరిస్థితి అంతంత మాత్రమేనని ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరామ్ విజ్ఞప్తి చేశారు.

వీనుల విందుగా వందేమాతరం గీతాలాపన

ఘనంగా బంకించంద్ర ఛటర్జీ జయంతి



వందే మాతరం పూర్తి గీతాన్ని ఆలపిస్తున్న వాకర్స్

అమలాపురం టౌన్: జాతీయ గీతాన్ని రచించిన బంకించంద్ర ఛటర్జీ 187వ జయంతిని పురస్కరించుకుని స్థానిక గడియారం స్తంభం సెంటరులో వాకర్స్ వందేమాతరం పూర్తి గీతాన్ని వీనుల విందుగా ఆలపించి అలరించారు. వాకర్స్ హెల్త్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం జరిగిన ఈ జయంతి కార్యక్రమంలో సంస్కార భారతి మాతృశక్తి సంయోజకులు వేదనభట్ల సాయిలక్ష్మి, విశ్రాంత ఉపాధ్యాయుడు వేదనభట్ల కళాపూర్ణరావులు వాకర్స్ చేత వందేమాతరం పూర్తి గీతాన్ని ఆలపింపజేశారు. ప్రతి విద్యాలయంలో వందేమాతర గీతం ప్రతి రోజూ విద్యార్థులు విధిగా ఆలపిస్తే వారిలో దేశభక్తి పెరుగుతుందని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు బోణం సత్య వరప్రసాద్ అన్నారు. క్లబ్ ఉపాధ్యక్షుడు నూకల సత్యనారాయణ, కోశాధికారి పడాల నాయుడు, జిల్లా వాకర్స్ పీఆర్వో యర్రమిల్లి సత్యనారాయణమూర్తి, వాకర్స్ బులిటన్ ఎడిటర్ పుత్సా కృష్ణ కామేశ్వర్, వలవల వెంకట రెడ్డి నాయుడు, తేతల సత్యనారాయణరెడ్డి, గుర్రం రామకృష్ణ తదితరులు వందేమాతర గీతాన్ని ఆలపించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో గతంలో జరిగిన నాడు- నేడు పనులు, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఆరోపణలు రావడంతో విద్యా శాఖ అధికారులు ఆ పాఠశాలలో గురువారం విచారణ చేపట్టారు. డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, ఎఫ్ఏవో ప్రవీణ్ తదితర అధికారుల బృందం ఈ విచారణ చేపట్టింది. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయినిగా పని చేస్తూ ఇటీవల బదలీపై వేరే మండలంలోని పాఠశాలకు వెళ్లిన ఆమెను అధికారులు విచారించారు. ప్రస్తుతం పాఠశాలలో పని చేస్తున్న సిబ్బందిని కూడా అధికారులు విచారించారు. పాఠశాలకు నాడు- నేడు పథకం కింద ఫస్ట్ ఫేజ్‌లో రూ.68 లక్షలు, సెకండ్ ఫేజ్‌లో అదనపు గదుల నిర్మాణానికి రూ.96 లక్షలకు విడుదలైన రూ.26 లక్షల ఖర్చులపై అధికారులు ఆరా తీశారు. అలాగే మధ్యాహ్న భోజనం పథకం అమలుపై కూడా ఆరా తీశారు. విద్యార్థుల సంఖ్యకు, పెట్టిన భోజనాల లెక్కలకు ఉన్న వ్యత్యాసంపై అధికారులు విచారించారు. డీఈవో డాక్టర్ షేక్ సలీమ్ బాషా ఆదేశాలతో ఈ విచారణ జరిగింది. పాఠశాల సిబ్బంది ఎవరు ఫిర్యాదు చేశారని విచారణాధికారులు పదే పదే అడిగినప్పటికీ ఆరోపణలు వచ్చాయి కాబట్టే విచారిస్తున్నామని స్పష్టం చేశారు.

ప్రత్యేక అలంకరణలో హజ్రత్ అబ్బాస్ పీర్లు



అమలాపురం పంజాలో ప్రత్యేకంగా అలంకరించిన పీర్లు

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణం 12వ వార్డులోని ముజఫర్ సందులో గల అబ్బాసియా పంజాలో పీర్లను గురువారం ప్రత్యేక అలంకరణ చేశారు. షియా ముస్లిం ఆరాధ్యదైవ మైన దూత మహ్మద్ ప్రవక్త మనమడు అయిన ఇమామ్ హుస్సేన్‌ను ఇరాక్ దేశం కర్బలా ఎడారిలో బంధించి హింసించిన రోజును పురస్కరించుకుని అమలాపురంలోని పంజాలో పీర్ల వద్ద షియాలు సంతాప దినాలు ఆరంభించారు. పంజాకు పట్టణం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి షియాలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. గురువారం రాత్రి నింగిలో నెలవంకను చూసిన తర్వాత మొహరం నెల షియా ముస్లింలకు శోకత్వ హృదయాలతో మొదలైంది. పంజా ధర్మకర్త మహ్మద్ నిసార్ హుస్సేన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం మొదలైంది. పంజా కార్యదర్శి కర్రార్ హుస్సేన్ భక్తి గీతాలపన చేశారు. మహ్మద్ చాంద్ బాషా, అబ్బాస్, అమీర్, కర్రార్ తదతరులు వచ్చిన షియాలకు ప్రసాద వితరణ చేశారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం



సంజన కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్ తదితరులు

తాళ్లరేవు: ఇటీవల పాము కాటుకు గురై మృతి చెందిన ఇంటర్మీడియెట్ విద్యార్థిని వడ్డి సంజన కుటుంబ సభ్యులకు జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కొప్పిశెట్టి వెంకట్ ఆర్థిక సహాయం అందజేశారు. గురువారం పటవల పంచాయతీ శివారు శాంతిమూల గ్రామానికి చెందిన సంజన తల్లిదండ్రులను నేతలు పరామర్శించి ఓదార్చారు. ఈ సందర్భంగా రూ.7 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేసి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు కొటికెల పూడి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని ధర్నా

తాళ్లరేవు: ఉపాధి కూలీల వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం ధర్నా నిర్వహించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ ధర్నానుద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.ఈశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలు పనులు చేసి ఆరువారాలు గడుస్తున్నా వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. వేతనాలు అందక అనేక ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు పి.గోపాలకృష్ణ, బి.వెంకటేశ్వరరావు, జి.భాస్కరరావు, డి.వీర్రాజు సునీత తదితరులు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

- మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలి
- ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమరబాబు



ముమ్మిడివరంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోలీసులు, నాయకులు



మాదకద్రవ్యాలపై అవగాహన కల్పిస్తున్న మెరైన్ సీఐ మూర్తి

అమలాపురం టౌన్: మత్తుతో జీవితాలు చిత్తు అవుతాయని, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని అమలాపురం ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ జి.అమరబాబు సూచించారు. జాతీయ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక మిరియాం కళాశాలలో విద్యార్థులతో గురువారం నిర్వహించిన అవగాహన సదస్సుకు అమరబాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా 'వ్యక్తిత్వ మనో వికాసాభివృద్ధికి డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలు' అనే అంశంపై అసిస్టెంట్ సూపరింటెండెంట్ అమరబాబు విద్యార్థులకు అవగాహన కల్పించారు. డ్రగ్స్ వాడడం వల్ల ఎదురయ్యే శారీరక రుగ్మతలు, డ్రగ్స్ సేవించినా, వాటితో పట్టుబడినా చట్టంలోని సెక్షన్లు, శిక్షలు ఎంతటి తీవ్రంగా ఉంటాయో వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ నల్లా తమ్మేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ అవగాహన సదస్సులో ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుళ్లు పెట్టా సత్యనారాయణ, భద్రరావు, కె.నాగేంద్రకుమార్, సీహెచ్. నాగేశ్వరరావు, కళాశాల అధ్యాపకుల పాల్గొని డ్రగ్స్ రహిత సమాజ ఆవిష్కరణకు అందరూ పాటు పడదామని ప్రతిజ్ఞ చేశారు.

యువత డ్రగ్స్‌కు బానిసలు కాకూడదు

ముమ్మిడివరం: యువత డ్రగ్స్‌కు బానిసలు కాకుండా వారి విలువైన జీవితాలను తమ కుటుంబాలతో పాటు సమాజహితానికి వినియోగించాలని మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద పేర్కొన్నారు. సీఐ ఎం.మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గుత్తుల సాయి, గొలకోటి దొరబాబు, అర్థాని శ్రీనివాసరావు, దొమ్మేటి రమణకుమార్, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన ఎస్సైలు డి.జ్వాలా సాగర్, ఎంవీవీ రవీంద్రబాబు, అవినాష్, నాయకులు, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

యానాం: అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని స్థానిక ఎస్ఎస్ఏ సమావేశ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆర్ఏఓ మునిస్వామి పాల్గొని మాట్లాడారు. యువత చదువుపై దృష్టిసారించాలని, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై పునీత్‌రాజ్, ట్రాఫిక్ ఎస్సై శేరు నూకరాజు, స్టేషన్‌హౌస్ఆఫీసర్-2 కట్టా సుబ్బరాజు, విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

అల్లవరం: మాదక ద్రవ్యాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని మెరైన్ ఇన్‌స్పెక్టర్ ఎంవీవీఎస్ఎన్ మూర్తి అన్నారు. ఓడలరేవు ఉన్నత పాఠశాలలో ఓడలరేవు మెరైన్ పోలీసుల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మారకద్రవ్యాల వ్యతిరేక దినం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా మెరైన్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ మత్తు పదార్థాల గురించి ఎవరికి సమాచారం తెలిసినా పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఓడలరేవుతో పాటుగా కొమరగిరిపట్నం, వాసాలతిప్ప, ఎస్.రామేశ్వరం పాఠశాలల్లో విద్యార్థులకు మాదకద్రవ్యాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మెరైన్ ఎస్సై బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అక్షయ పాత్రను అమలు చేయాలి

యానాం: నియోకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకంగా అక్షయపాత్రను అమలు చేయాలని గురువారం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పుదుచ్చేరి విద్యాశాఖ మంత్రి నమశ్శివాయానికి విజ్ఞప్తి చేశారు. రెండోసారి ఆయన కార్యాలయంలో విద్యామంత్రి నమశ్శివాయంను కలిసి అక్షయపాత్ర అమలుపై చర్చించారు. ఈ సమస్యపై గత నాలుగేళ్లగా అసెంబ్లీలో ప్రస్తావించినట్లు తెలిపారు. దీనికి స్పందించిన మంత్రి నమశ్శివాయం మాట్లాడుతూ అక్షయపాత్ర ఫౌండేషన్ ద్వారా మధ్యాహ్న భోజనం సరఫరా చేసేందుకు ఇప్పటికే అన్ని పనులు పూర్తి చేశామని త్వరలో అమలు చేస్తామని హామీ ఇచ్చారు. యానాంలో త్వరలో విద్యాశాఖ బృందం తనిఖీ చేసి గెస్ట్, పారా టీచర్లను రెగ్యులర్ ప్రతిపాదనలపై సమీక్షిస్తుందన్నారు. కోచ్‌లను రెగ్యులర్ చేయాలనే ప్రతిపాదన సైతం పరిశీలిస్తుందన్నారు.

నూతన ఎంపీడీవోగా తులసీకృష్ణ



తులసీకృష్ణకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందిస్తున్న కార్యదర్శులు, సిబ్బంది

ఉప్పలగుప్తం: మండల ఎంపీడీవోగా భూపతిరాజు తులసీకృష్ణ గురువారం అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ముమ్మిడివరం కార్యాలయంలో ఏవోగా విధులు నిర్వహిస్తూ ఇక్కడకు ఎంపీడీవో కార్యాలయం ఏవోగా బదిలీపై వచ్చారు. ఈ మేరకు ఇన్‌చార్జి ఎంపీడీవోగా పూర్తి అదనపు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మండల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, ఎంజీఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

అమలాపురం రూరల్: కామనగరువు 33/కేవీసబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, విద్యుత్ లైన్ల మరమ్మతు పనుల నిర్వహణ కారణంగా అమలాపురం మండలంలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కే రాంబాబు తెలిపారు. పట్టణంలో ఓల్డ్ హెచ్‌బీ కాలనీ, న్యూ హెచ్‌బీ కాలనీ, వేంకటేశ్వరస్వామి గుడి, కోర్టుఫీడర్, శ్రీరాంపురం, కామనగరువు, వన్నెచింతలపూడి, సమనస, భట్నవిల్లి, ఏ వేమవరం, వేమవరప్పాడు, చిందాడగరువు, జనుపల్లి, నల్లమిల్లి, రెడ్డిపల్లి, సవరప్పాలెం ,తాండవపల్లి, రంగాపురం, తదితర గ్రామాలకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్టు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు రేపు అంతరాయం

యానం: నియోజకవర్గానికి విద్యుత్ సరఫరా జరిగే ప్రధానమైన కాకినాడ 132 కేవీ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతులు నిర్వహణ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని గురువారం విద్యుత్ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు యానాం నియోజకవర్గమంతా విద్యుత్ సరఫరా నిలిపవేయనున్నట్టు తెలిపారు.

మున్సిపల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి



చిన్నాసెంటర్‌లో స్ట్రీట్ కార్నర్ సమావేశంలో మాట్లాడుతున్న ఉద్యోగులు

యానాం: తమ డిమాండ్ల సాధనకు యానాం మున్సిపల్ ఉద్యోగులు ఆ సంఘం ఆధ్వర్యంలో గురువారం పట్టణంలో సమావేశం నిర్వహించారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించి, అవగాహన కల్పించేలా స్ట్రీట్ కార్నర్ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన 6 నెలల బకాయి జీతాలు చెల్లించాలని, విశ్రాంత ఉద్యోగులకు రావాల్సిన రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను అందజేయాలని, ఏడో వేతన సంఘం సిఫారసులు అమలు చేయాలని, సీఎం రంగసామి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తదితర డిమాండ్లు తెలియజేశారు. అనంతరం పాతబస్టాండ్ అంబేడ్కర్‌సర్కిల్, స్టేట్‌బ్యాంక్ జంక్షన్, జీపమెర్ జంక్షన్, అడ్మినిస్ట్రేటర్ ఆఫీసు ఎదురుగా స్ట్రీట్‌కార్నర్ సమావేశాలను నిర్వహించి తమ డిమాండ్లను వివరించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు పెనుపోతు కృష్ణ, కర్రి రాంబాబు, చెల్లి గోపీనాథ్, అత్తిలి గోవింద్‌రాజ్, విప్పర్తి తేజకిరణ్మయి, తలాటం దేవి, గూటం రాంబాబు, వీరకుమార్, చినగోవిందు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే మలేరియా నిర్మూలన

అలమూరు: వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు, పరిసరాల పరిశుభ్రత పాటించడం ద్వారా మలేరియాను పూర్తిగా నిర్మూలించవచ్చని పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డి.సాయికిషోర్ అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ పరిధిలో గురువారం వైద్యారోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి శుక్రవారం నిర్వహించే డ్రైడేపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆరోగ్య సిబ్బందికి సూచించారు. మలేరియా నివారణకు దోమల నిర్మూలనే సరైన మార్గమని చెప్పారు. దీనిపై నెల రోజుల పాటు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలన్నారు. సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ ఏవీవీ రాజా, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, ఆర్.బాలామణి పాల్గొన్నారు.